# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 172  పేజీలు : 04  వెల రూ. 2  మంగళవారం  23 - 12 - 2025




హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది...

ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

## చంద్రబాబును ఓసారి గురువు అంటారు, మరోసారి కాదంటారు



- రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు విమర్శ
- చంద్రబాబు మీ గురువు అని మేం అంటే రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేస్తాడన్న హరీశ్ రావు
- మొన్న వెంకయ్యతో స్వయంగా చంద్రబాబే తన గురువు అని అంగీకరించాడని వెల్లడి
- ఓసారి దేవత అంటారు, మరోసారి బలిదేవత అంటారని విమర్శ

## బీఆర్ఎస్ నాయకత్వంపై

# రేవంత్‌రెడ్డి సెటైర్లు

- వీడియో సాక్ష్యాలతో కేసీఆర్‌ను కడిగేసిన రేవంత్ రెడ్డి!
- కేసీఆర్.. చంద్రబాబు శిష్యుడు కాబట్టే తెలంగాణకు జల ద్రోహం చేశారన్న రేవంత్
- గతంలో కేసీఆర్ మాట్లాడిన మాటల వీడియోను ప్రదర్శించిన సీఎం
- కేసీఆర్ సభలు పెట్టే చోటల్లా ఈ వీడియోను ప్రదర్శిస్తామని హెచ్చరిక
- పోతిరెడ్డిపాడు నుంచి 10 టీఎంసీల నీటిని తరలించుకోమని చెప్పి.. మన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సామర్థ్యాన్ని మాత్రం 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి కుదించిన ఘనత కేసీఆర్‌దే
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో బీఆర్ఎస్‌కు రహస్య సయోధ్య కుదిరిందని రేవంత్ అనుమానం వ్యక్తం చేశారు



గత పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణ జల ప్రయోజనాలను పొరుగు రాష్ట్రానికి ఎలా ధారాదత్తం చేశారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టారు. ఆదివారం విలేకరుల సమావేశంలో తన మొబైల్ ఫోన్‌లో పాత వీడియోలను ప్రదర్శించారు. అందులో కేసీఆర్ మాట్లాడుతూ.. "తెలంగాణ భూభాగం ఎత్తులో ఉంది, నీటిని ఎత్తిపోయడం ఖర్చుతో కూడుకున్న పని.. కాబట్టి ఏపీ

- మిగతా 2 లో

## అదానీ, అంబానీల కోసమే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారు



- తెలంగాణ మంత్రి సీతక్క
- జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడంపై సీతక్క ఫైర్
- గాంధీ పేరు తీసేసి ఆయనను మరోసారి హత్య చేశారన్న సీతక్క
- పథకాన్ని కాపాడాలని అన్ని గ్రామాల్లో తీర్మానం చేస్తామని వెల్లడి

జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడంపై విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తెలంగాణ మంత్రి సీతక్క ఈ అంశంపై మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టానికి కేంద్రం మహాత్మా గాంధీ పేరును తీసేసి, ఆయనను మరోసారి హత్య చేసిందని అన్నారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.అదానీ, అంబానీల మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని సీతక్క మండిపడ్డారు. ఈ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని అన్ని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ నెల 27 లేదా 28 తేదీలో ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు, వలసలను

- మిగతా 2 లో

# ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

- మీనాగట్ట అడవుల్లో ఆయుధ తయారీ కేంద్రం
- ధ్వంసం చేసిన భద్రతా దళాలు
- భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం
- సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం
- స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు



## 'బ్లూబర్డ్ బ్లాక్-2' ప్రయోగం ముంగిట తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

- కీలక ప్రయోగానికి ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్
- డిసెంబర్ 24న LVM3`M6 రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం
- అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్న ఇస్రో
- సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా 4G/5G సేవలు అందించడమే లక్ష్యం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టే ప్రతి కీలక ప్రయోగానికి ముందు దైవ దర్శనం చేసుకోవడం దశాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయం. ఈ ఆనవాయతీని కొనసాగిస్తూ, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు, లాంచ్ టీమ్ సభ్యులతో కలిసి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు.డిసెంబర్ 24న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టనున్న

- మిగతా 2 లో

# అమరావతిలో కల్చరల్ సెంటర్

- సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం
- అమరావతిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- జోన్-8 ఎల్పీఎస్ లేఅవుట్ అభివృద్ధికి రూ.1358 కోట్ల కేటాయింపు
- క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని సూచన
- వివిధ అభివృద్ధి పనులకు 56వ సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం
- రాజధాని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం




## మాస్కోలో కారు

# బాంబు దాడి


- రష్యాకు చెందిన కీలక జనరల్ మృతి
- ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు అనుమానాలు



## నేడు సీఎం చంద్రబాబు

# 'క్వాంటం టాక్'

- 50 వేల మంది టెక్ విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రసంగం
- టెక్ విద్యార్థులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- క్వాంటం ప్రోగ్రామ్‌కు 50 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్లు
- నమోదు చేసుకున్నవారిలో 51 శాతం మంది అమ్మాయిలే!
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్‌లో ఇంటర్న్‌షిప్
- అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం




క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'క్వాంటం టాక్' పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్ విద్యార్థులను ఉద్దేశించి డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు. క్వాంటం ఐటీ

- మిగతా 2 లో

# ఆదాయం కాదు...

# ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలి

- బెల్టు షాపుల కట్టడికి హర్యానా మోడల్‌పై అధ్యయనం
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆబ్కారీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఆదాయం కాదు... ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని సూచన
- విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పునఃపరిశీలన
- ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని ఆదేశం
- అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు




రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, ఇంకా... లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు... తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలని సూచించారు.బార్ ఏఆర్ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని సీఎం నిర్దేశించారు.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## అసత్యాలు... అర్ధ సత్యాలు



సొంత శిబిరంలో విభేదాలూ, అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థ, కానరాని ఉపాధి కల్పన, మధ్యంతర ఎన్నికల్లో ఓటర్ల తిరస్కరణ వగైరాలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఊపిరాడనీయటం లేదని వైట్‌హౌస్ వేదికగా ఆయన జాతినుద్దేశించి చేసిన ప్రసంగం తేటతెల్లం చేసింది. పాత సంవత్సరానికి వీడ్కోలుగా, అధికారంలోకొచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా ఆయన చేసిన ఈ ప్రసంగం ఒకపక్క స్వోత్కర్షలతో, మరోపక్క సంజాయిషీలతో నిండిపోయింది. అసత్యాలు, అర్ధ సత్యాలు సరేసరి. తరచు వైట్‌హౌస్ వేదికగా జరిగే మీడియా సమావేశాల్లో ఆయన చేసే వ్యాఖ్యలకూ, ఈ ప్రసంగానికీ కాస్తయినా తేడా లేదు. స్వీయ వైఫల్యాలను నిష్క్రమించిన అధ్యక్షుడు జో బైడెన్ ఖాతాకు మళ్లించి... జరగని యుద్ధాలనూ, జరిగినా తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఆపినా మళ్లీ మొదలైన యుద్ధాలనూ సైతం తన విజయంగా ప్రకటించుకున్నారు. అందులో భారత్ - పాక్ సంఘర్షణ ఒకటి. వలసదారులను దేశం విడిచి వెళ్లేలా చేసి అలా ఆదా చేసిన సొమ్మంతా అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు ఉచితంగా వైద్యం, విద్య రూపంలో అందిస్తున్నామని ట్రంప్ చెప్పుకొన్నారు. ఇళ్ల అద్దెలు తగ్గాయనీ, ఉద్యోగాలు వచ్చిపడ్డాయనీ, పెట్టుబడులు రప్పించాననీ ప్రకటించుకున్నారు.నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టడానికి వలసదారుల తోడ్పాటు ఎంతో ఉంది. దేశంలో అగ్ర సంస్థలుగా పేరొందిన వాటిలో 46 శాతం... అంటే 230 కంపెనీలు వలసదారులూ, వారి పిల్లలూ స్థాపించినవే. ఈ ఏడాది న్యూ అమెరికన్ ఫార్చ్యూన్ - 500లో చేరిన పది కంపెనీల్లో సగం వలసదారులవే. 2023 గణాంకాల ప్రకారమైతే ఆ ఏడాది వలసదారులు సృష్టించిన సంపద లక్షా 70 వేల కోట్ల డాలర్లు. వారు పన్ను రూపంలో చెల్లించిన మొత్తం 65,200 కోట్ల డాలర్లు.వాస్తవాలు ఇవి కాగా, చట్టవిరుద్ధంగా వచ్చినవారితోపాటు అమెరికా పౌరసత్వం పొందినవారిని సైతం ట్రంప్ ప్రభుత్వం రాచి రంపాన పెడుతోంది. వారిలో అనవసర భయాందోళనలను సృష్టిస్తూ, ప్రజల్లో అనైక్యత తీసుకురావటానికి అబద్ధాలను ప్రచారంలో పెడుతోంది. ఆయన వచ్చాక వలస వ్యవహారాల న్యాయమూర్తులుగా వున్న 100 మందిని తొలగించారు. టానియా నెమెర్ అనే మహిళా న్యాయమూర్తిని ఒక కేసు విచారిస్తుండగానే కారణం చెప్పకుండా బెంచ్ నుంచి, ఆ తర్వాత సర్వీసు నుంచి తొలగించారు. ప్రస్తుత వైఫల్యాలకు కారణం గతంలోని అస్తవ్యస్తతే కారణమని చెప్పడం ఇటీవల అన్ని దేశాల్లోనూ పాలకులకు అలవాటైన విద్య. ట్రంప్ సైతం ఆ పాటే పాడారు. నిజానికి జో బైడెన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉంది. వలసదారులను తరిమేయటం ద్వారా దాన్ని మరింత గొప్పగా మారుస్తానని అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో ట్రంప్ పదే పదే చెప్పారు. కానీ జరిగిందంతా వేరు. ఇష్టానుసారం ప్రపంచ దేశాలపై సుంకాలు పెంచటం వల్ల దేశీయ వినియోగదారులు సగటున 16.8 శాతం అదనంగా పన్నులు చెల్లించాల్సి వస్తున్నదనీ, 1935 నుంచి చూస్తే ఇదే అత్యధికమనీ యేల్ బడ్జెట్ ల్యాబ్ అంచనా వేసింది. దిగుమతైన సరుకులపై ప్రభుత్వం విధించే అదనపు సుంకాలను అంతిమంగా భరించేది అమెరికా వినియోగదారులే. ట్రంప్ అనుకూల ఫాక్స్ న్యూస్ సర్వేలో 72 శాతం మంది గడ్డు ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటు న్నామని చెప్పగా, 58 శాతం మంది ఆయన అనుచిత విషయాలపై శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. ఇక అక్టోబర్, నవంబర్ నెలల్లో 41,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. నిరుద్యోగిత 4.6 శాతానికి ఎగబాకింది. 2021 తర్వాత ఈ స్థాయికి పోవటం ఇదే ప్రథమం. గంజాయి వాడకాన్ని చట్టబద్ధం చేయటానికి ప్రయత్నిస్తూ మాదక ద్రవ్యాలపై పోరాడుతున్నానని చెప్పుకోవటం ట్రంప్‌కే చెల్లింది.దేశం ఎదుర్కొంటున్న సమస్యలను చిత్తశుద్ధితో చర్చించి, వాటి పరిష్కారానికి తాను అనుసరిస్తున్న విధానాలేమిటో చెప్పి భవిష్యత్తు బాగుంటుందని చెప్పివుంటే కనీసం కొందరైనా నమ్మేవారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఒప్పుకొంటే, దానికి జవసత్వా లిచ్చేందుకు ఆయన ఏదో ఒకటి చేస్తారన్న ఆశయినా మిగిలేది. దానికి బదులు అంతా సవ్యంగా ఉందని చెప్పడం వల్ల ట్రంప్‌పై కొద్దో గొప్పో ఉన్న విశ్వాసం కూడా దెబ్బతింది. ఆయన రేటింగ్ పడిపోవటంలో ఆశ్చర్యమేముంది?

# సీఎం చంద్రబాబు 'క్వాంటం టాక్'

కంపెనీలైన క్యూబిట్, వైసర్‌లతో కలిసి ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.ఈ క్వాంటం ప్రోగ్రామ్ కోసం కేవలం 10 రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 51 శాతం మంది మహిళా విద్యార్థులే ఉండటం విశేషం. అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు ఏపీలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 వేల మందికి ఉన్నత స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. వీరి నుంచి ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటం మిషన్‌లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తారు. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, రాబోయే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసర్ డైరెక్టర్ ప్రాచీ వఖారియా వంటి ప్రముఖులు పాల్గొననున్నారు.

## 'బ్లూబర్డ్ బ్లాక్-2' ప్రయోగం ముంగిట తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్



LVM3`M6 మిషన్ విజయవంతం కావాలని కోరుతూ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వాణిజ్య ప్రయోగంలో భాగంగా, ఇస్రో తన హెవీ-లిఫ్ట్ లాంచ్ వెహికల్ LVM3 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 'ఏఎస్టీ స్పేస్‌మొబైల్' సంస్థ అభివృద్ధి చేసిన 'బ్లూబర్డ్ బ్లాక్-2' ఉపగ్రహాన్ని లో ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనుంది.ఈ శాటిలైట్ ప్రయోగం ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ప్రత్యేక హార్డ్‌వేర్ అవసరం లేకుండా నేరుగా సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకే హై-స్పీడ్ సెల్యులార్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడం. దీని ద్వారా 4G/5G వాయిస్, మెసేజింగ్, స్ట్రీమింగ్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. షార్‌లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు.

## అదానీ, అంబానీల కోసమే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారు

అరికట్టేందుకు గత యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే... ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీకి ఉరి వేసిందని దుయ్యబట్టారు.

# బెల్టు షాపుల కట్టడికి హర్యానా మోడల్‌పై అధ్యయనం

అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేయాలని నిర్దేశించారు.సచివాలయంలో సోమవారం నాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ ఈడీ రాహుల్ దేవ్ శర్మ హాజరయ్యారు. కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావంపై సమీక్షలో సమగ్రంగా చర్చించారు. అనధికార విక్రయ కేంద్రాలుగా తయారైన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపులు పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి హర్యానాలో అనుసరించిన సబ్ లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం గ్రామీణ, దూర ప్రాంతాల్లో షాపులు లేకపోవడం వల్ల బెల్ట్ షాపుల సమస్య నెలకొందని అధికారులు చెప్పారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా... మద్యం వినియోగం అనంతరం బాటిల్



తిరిగి ఇస్తే డీఆర్ఎస్ (డిపాజిట్ రిటర్న్ స్కీమ్) కింద నగదు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

**పెరిగిన మద్యం విక్రయాలు**

అక్టోబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు...రూ.8,000 కోట్లు ఎక్సైజ్ ఆదాయం లక్ష్యం పెట్టుకోగా, రూ.7,041 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 202526 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 17 వరకు మద్యం విక్రయాల్లో 4.52 శాతం పెరుగుదల కనిపించిందని... ఐఎంఎఫ్ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) విక్రయాలు 19.08 శాతం, బీర్ విక్రయాలు 94.93 శాతం పెరిగాయని అధికారులు వెల్లడించారు. ఈ డిసెంబర్ 18 నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.8,422 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 3 శాతం పెరుగుదల చూపిస్తామని అధికారులు చెప్పారు.

**35 శాతం డిజిటల్ చెల్లింపులు**

మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతం పెరిగాయని, కొన్ని జిల్లాల్లో 4047 శాతం వరకు డిజిటల్ లావాదేవీలు నమోదైనట్టు వివరించారు. అయితే నగదు వినియోగాన్ని తగ్గించి... డిజిటల్ చెల్లింపులు జరిగేలా అందరిలో అవగాహన పెంచాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి మద్యం బాటిల్‌కు ప్రత్యేక లిన్ (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్) త్వరితగతిన తీసుకురావాలని, సాధారణ ప్రజలు కూడా సులభంగా గుర్తించేలా ఉండాలన్నారు. లిన్‌లో... బ్రాండ్, బ్యాచ్, లైన్‌తో పాటు తయారైన తేదీ, గంటలు, నిమిషాలు, సెకన్లు సహా వివరాలు ఉండాలన్నారు.

# అమరావతిలో కల్చరల్ సెంటర్

రాజధాని అమరావతిలో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఒక ఆధునిక కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీని కోసం వెంటనే అనువైన భూమిని గుర్తించాలని సూచించారు. నేడు సచివాలయంలో జరిగిన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి, పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి పనులపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అమరావతిలో ఒక వేదిక ఉండాలి. రాష్ట్ర సంస్కృతికి అద్దంపట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వారి సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలి," అని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలోని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.

**56వ సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన అంశాలు**

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ 2 ఎకరాల పరిధిలో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్

అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపు.

శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం.

హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో 6 ఎకరాలు కేటాయింపు.

8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు.

ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ.1358 కోట్లు కేటాయింపు.

202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు. వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు.ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకత్వంపై రేవంత్‌రెడ్డి సెటైర్లు

సోదరులే ఆ నీటిని వాడుకోవాలి" అని కేసీఆర్ చెప్పడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాళహస్తి వరకు బరాజ్‌లు కట్టుకోవాలని చంద్రబాబుకు సలహా ఇచ్చింది కేసీఆరేనని, పట్టిసీమ ప్రాజెక్టును గొప్పగా పొగిడింది కూడా ఆయనేనని రేవంత్ ఆరోపించారు."పోతిరెడ్డిపాడు నుంచి 10 టీఎంసీల నీటిని తరలించుకోమని చెప్పి.. మన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సామర్థ్యాన్ని మాత్రం 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి కుదించిన ఘనత కేసీఆర్‌దే" అని మండిపడ్డారు. కేసీఆర్ బహిరంగ సభలు పెట్టే చోటల్లా ఆయన ఏపీ ప్రాజెక్టులను సమర్థిస్తూ మాట్లాడిన ఈ వీడియోలను ప్రదర్శిస్తామని హెచ్చరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో బీఆర్ఎస్‌కు రహస్య సయోధ్య కుదిరిందని రేవంత్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. "కాళేశ్వరం విఫలమై ఇన్ని రోజులవుతున్నా సీబీఐ విచారణకు



కేంద్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు? ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక అధికారుల విచారణకు అడ్డంకులు ఎందుకు సృష్టిస్తోంది? దీన్ని బట్టే కేసీఆర్‌కు, కేంద్రానికి మధ్య ఉన్న దోస్తీ అర్థమవుతోంది" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాజకీయంగా చంద్రబాబు శిష్యుడేనని, అందుకే ఆయనకు మేలు చేసేలా గోదావరి నీటిని వాడుకోమని చెప్పారని విమర్శించారు.బీఆర్ఎస్ నాయకత్వంపై రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. కేసీఆర్, కేటీఆర్ మధ్య కనీస ఏకాభిప్రాయం లేదని ఎద్దేవా చేశారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి పరిశ్రమల తరలింపుపై తండ్రి ఒక మాట చెబితే, కొడుకు మరో మాట మాట్లాడుతున్నారని.. పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తికి కనీస అవగాహన లేకుండా పోయిందని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యంలో ఉందని, కావాలంటే దీనిపై నిజనిర్ధారణ కమిటీని వేయడానికి సిద్ధమని సీఎం పేర్కొన్నారు.

# చంద్రబాబును ఓసారి గురువు అంటారు, మరోసారి కాదంటారు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువు అని అంటే ఆయన తమపై విమర్శలు చేస్తారని, కానీ మొన్న మాజీ ఉపరాష్ట్రపతిని కలిసి చంద్రబాబే తన గురువు అని చెప్పారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఒకసారి చంద్రబాబు నీ గురువు అంటే ఆగ్రహం వ్యక్తం చేస్తావు, మరోసారి తానే స్వయంగా నా గురువు అని అంగీకరిస్తాడని, దేవత అంటారు, బలిదేవత అంటారని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి విమర్శలు చేయడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించిందని అన్నారు.జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా కేసీఆర్ నిలిపారని అన్నారు. మూడు రెట్ల జీఎస్డీపీ, తలసరి ఆదాయం పెరిగిందని వెల్లడించారు. కానీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి అయి రెండేళ్లైనా ఇంకా ప్రిపేర్ కాకుండా సభకు వస్తున్నారని విమర్శించారు. ఆయన సగం సగం ప్రెస్ మీట్లు పెట్టి పరువు తీస్తున్నారని అన్నారు.కేసీఆర్ నిన్న ప్రెస్ మీట్ పెట్టిన కాసేపటికే రేవంత్ రెడ్డి తన ఇంట్లోనే మీడియాతో చిట్‌చాట్ పెట్టారని అన్నారు. దీనితోనే ఆయనది ఎంత మరుగుజ్జు మనస్తత్వమో వెల్లడవుతోందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం పెరిగిందని రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని అన్నారు. రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయవద్దని కోరారు.సొంత పార్టీ నాయకులనే తొక్కుకుంటూ ఎదిగినట్లు రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని హరీశ్ రావు అన్నారు. రూ.50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారని



గుర్తు చేశారు. నిజాయతీగా, త్యాగాల పునాదులపై ఎదిగిన నాయకత్వం బీఆర్ఎస్ పార్టీది అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులను గడ్డిపోచల్లా త్యాగాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ నేతలదని అన్నారు.

# ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను మరియు ఆయుధాలను వెలికితీశారు.సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.



# మాస్కోలో కారు బాంబు దాడి



మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో కీలక రష్యా సైనిక జనరల్ ఒకరు మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు సంస్థ వెల్లడించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్‌కు చెందిన ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్, బాంబు దాడి ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో మరణించినట్లు ఆ సంస్థ తెలిపింది.ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్టుమెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని ఆపేందుకు వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదు. ఇటీవల కాస్పియన్ సముద్రంలోని రష్యా కీలక చమురు క్షేత్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ముమ్ముందు మరిన్ని దాడులు చేస్తామని కూడా హెచ్చరించింది.

# సర్పంచ్ పదవీ బాధ్యత స్వీకరించిన నల్లనీరజ సతీష్ రెడ్డి

**పదవులు శాశ్వతం కాదు, మనం చేసే పనులే శాశ్వతం**





**గొల్లపల్లి డిసెంబర్ 22, ప్రజా మంటలు (ప్రతినిధి అంకం భూమయ్య) :** గొల్లపల్లి మండల కేంద్రంలో నూతనంగా సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, పాలకవర్గంతో గ్రామపంచాయతీ అవరణంలో కార్యదర్శి రాజిరెడ్డి,పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సర్పంచ్ నల్ల నీరజ మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదు మనం చేసే పనులే శాశ్వతం, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ఉప సర్పంచ్,వార్డు సభ్యుల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.ఇప్పటివరకు గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల పరిపాలనలో ఉన్నాయి.పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గం కొలువుదీరడం తో ప్రత్యేక అధికారుల పరిపాలన నేటితో ముగిసింది ఇక నుంచి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఐదు సంవత్సరాలు కాలం పాటు పదవిలో కొనసాగుతారు సుదీర్ఘకాలం తర్వాత పంచాయతీ సర్పంచులు అధికారాన్ని చేపట్టనున్నారు గ్రామపంచాయతీ లో రెండు సంవత్సర కాలం పాటు నిధులు లేక ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయి పదవి స్వీకారం చేపట్టగానే స్వాగతం పలకనున్నాయి వీరి రాకతోనైనా పంచాయతీలలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయా అలాగే కొనసాగుతాయా అనేది సర్పంచుల పనితీరు తో తేలనున్నాయి.ముఖ్యంగా త్రాగునీరు సౌకర్యం, మురికినీటి కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధం, పంచాయతీలో నెలకొన్న మరికొన్ని సమస్యలు పరిష్కారానికి వేచి చూడాల్సిందే ఇది ఏమైనాప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు సరైన నిధులు కేటాయిస్తే తప్ప తిష్ట వేసిన సమస్యలు పరిష్కారం కావు అనేది స్పష్టం మొత్తానికి సర్పంచ్ అభివృద్ధి పనులు ఎలా చేస్తారు అని వేచి చూడాల్సిందే అని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,కులసంఘాలు, యువత, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం గ్రామ అభివృద్ధికి కృషి

**ప్రమాణస్వీకారోత్సవంలో సర్పంచ్ భారతి, ఉప సర్పంచ్ హరికుమార్**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని 25 గ్రామపంచాయతీలలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. మండలంలోని ముత్తారం గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్ గా ఊరడి భారతి జైపాల్ రెడ్డి, మాట్ల హరికుమార్ పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ ప్రజల ద్వారా సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారాలు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. డ్రైనేజీ, వీధిలైట్లు, వాడవాడల రోడ్లు ఇంటింటికి నీళ్లు అందించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాలతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, వార్డు సభ్యులు పార్నందుల నవిత, దండేపల్లి శిరీష, మ్యాక నరేష్, కొర్ర తిరుపతి, కడారి ప్రభాస్ దొండ మౌనిక, రేణుకుంట్ల సందీప్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొలువుతీరిన గ్రామ సచివాలయ సర్పంచులు

**సమస్యల వలయంలోకి అడుగుపెట్టిన నూతన పాలకవర్గాలు**





**భీమదేవరపల్లి డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** భీమదేవరపల్లి మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం సోమవారం నూతన సర్పంచులు అధికారికంగా కొలువుతీరారు. మండలంలోని కొత్తగా ఏర్పడిన పంచాయతీలతో కలిపి మొత్తం 25 గ్రామాల్లో నూతన సర్పంచులు బాధ్యతలు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు నూతన పంచాయతీ పాలక వర్గాలతో ప్రమాన స్వీకార కార్యక్రమాలను నిర్వహించారు. అయితే బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచులకు అభివృద్ధి పథకాలకన్నా ముందుగా సమస్యలే స్వాగతం పలికాయి. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పేరుకుపోయిన పెండింగ్ పనులు, చెల్లించాల్సిన బిల్లులు, గత పాలకవర్గాల హయాంలో మిగిలిన బకాయిలు స్పష్టత లేక అయోమయంగా మారాయి. ముఖ్యంగా గత సర్పంచుల కాలానికి సంబంధించిన బిల్లులు చెల్లింపులు కావాల్సి ఉండగా, నిధుల లభ్యత, ఫైళ్ల క్లియరెన్స్ లేక నూతన సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం."ముందు నుయ్యి %-% వెనక గొయ్యి" అన్న సామెతను తలపించేలా నూతన సర్పంచుల ప్రస్థానం ప్రారంభమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు గ్రామస్తుల ఆశలు, మరోవైపు పెండింగ్ సమస్యలు, నిధుల కొరత మధ్య సమతూకం పాటించడం సవాలుగా మారింది. అయినప్పటికీ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పారదర్శక పాలన అందిస్తామని, సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని నూతన సర్పంచులు హామీ ఇస్తున్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థను మరింత బలోపేతం చేసి, పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని, నిధుల విడుదల వేగవంతం చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. నూతన పాలకవర్గాల తొలి అడుగే సమస్యలతో నిండినప్పటికీ, సమన్వయం, సహకారంతో అభివృద్ధి బాటలో ముందుకు సాగుతామన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## గద్వాల్ జిల్లాలో అక్షరాస్యత, సాగునీరు, రోడ్లపై కవిత విమర్శలు

**జిల్లాలో జాగృతి జనంబాట**





**గద్వాల్, డిసెంబర్ 22 (ప్రజా మంటలు) :** జోగులాంబ గద్వాల్ జిల్లాలో జాగృతి జనంబాటలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, ఎస్సీ బాలికల గురుకులం, గట్టు ఎత్తిపోతల రిజర్వాయర్‌ను సందర్శించి రైతులు, నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నారు. నిర్వాసితులకు పూర్తి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గద్వాల్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని, ఇకపై బీఆర్ఎస్‌లోకి వెళ్లబోనని స్పష్టం చేశారు. జిల్లాలో అక్షరాస్యత పరిస్థితి దయనీయమని పేర్కొంటూ, ముఖ్యంగా మహిళల అక్షరాస్యత అత్యంత తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లాలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, ఇసుక మాఫియా కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విత్తన పత్తి రైతులకు న్యాయం జరగాలంటే ప్రభుత్వ పర్యవేక్షణలో టెస్టింగ్ వ్యవస్థ, కంపెనీలతో డైరెక్ట్ అగ్రిమెంట్లు అవసరమని తెలిపారు. రాజకీయ మార్పే గద్వాల్ అభివృద్ధికి మార్గమని కవిత పేర్కొన్నారు.

# ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి

**మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి**

**రంగయ్యపల్లి నూతన ప్రజా ప్రతినిధులకు ఘనసత్కారం**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, సభ్యులను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా రంగయ్యపల్లి గ్రామ సర్పంచ్ మండల రజిత మహేష్, ఉపసర్పంచ్ ఎలబోయిన రజిత శ్రీనివాస్, వార్డ్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డిని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులను ప్రవీణ్ రెడ్డి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు ఐక్యంగా పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. రంగయ్యపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గాంధీనగర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

**ఏకగ్రీవ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి**





**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** మండలంలోని గాంధీనగర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు నూతన పాలకవర్గంతో కలిసి కృషి చేస్తానని గాంధీనగర్ ఏకగ్రీవ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి తెలిపారు. గాంధీనగర్ నూతన గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గ్రామ ప్రత్యేక అధికారి నాగరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా గ్రామపంచాయతీ భవనానికి చేరుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించగా, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హాజరై నూతన సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.సమావేశంలో సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పాలకవర్గం, గ్రామ ప్రజల సమన్వయంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, పొన్నం ప్రభాకర్ సహకారంతో అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తనను ఏకగ్రీవంగా గెలిపించినందుకు గ్రామస్తులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, జిల్లా శాఖ అధ్యక్షులు గొర్రె థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి ఐలయ్య, గ్రామ ప్రత్యేక అధికారి నాగరాజు, ఉపసర్పంచ్ బుర్ర సమ్మయ్య, గ్రామ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ముందడుగు

**ముత్తారంలో నూతన సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన కొర్ర శ్రీకాంత్ స్వర్ణలత**





**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామంలో రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఒక మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు పరాజయం పొందిన అభ్యర్థి కొర్ర స్వర్ణలత – శ్రీకాంత్. గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనరల్ విభాగంలో ఊరడి భారతి జైపాల్ రెడ్డి, కొర్ర స్వర్ణలత – శ్రీకాంత్ ప్రత్యర్థులుగా పోటీలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఊరడి భారతి జైపాల్ రెడ్డి విజయం సాధించగా, ఫలితాల అనంతరం రాజకీయ శత్రుత్వాలకు తావులేకుండా గ్రామ ఐక్యతకు పెద్దపీట వేయడం గమనార్హం. ఎన్నికలు ముగిసిన వెంటనే "రాజకీయాలు ఎన్నికల వరకే, గ్రామాభివృద్ధి శాశ్వతం" అనే భావనతో, పరాజయం పొందిన కొర్ర స్వర్ణలత – శ్రీకాంత్ గెలుపొందిన సర్పంచ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరై అభినందనలు తెలియజేశారు. ఇది గ్రామ రాజకీయాల్లో అరుదైన దృశ్యంగా పలువురి ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఇలాంటి పరిపక్వ రాజకీయ సంస్కృతి వల్లే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. గెలుపు%-%ఓటములను సమానంగా స్వీకరిస్తూ, అభివృద్ధి కోసం అందరూ కలిసి ముందుకు సాగాలనే సందేశాన్ని కొర్ర స్వర్ణలత – శ్రీకాంత్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇక నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరి సహకారం అవసరమని, రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి ముత్తారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఘటనతో ముత్తారం గ్రామం రాజకీయాలకు అతీతమైన ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందని గ్రామ పెద్దలు కొనియాడుతున్నారు.

## ఆదర్శ పాఠశాలలో గణిత ప్రయోగశాల ప్రారంభం



**భీమదేవరపల్లి డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** మండలంలోని ముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గణిత ప్రయోగ శాలను మండల విద్యాధికారి ఎం. సునీతారాణి ప్రారంభించారు.గణిత ప్రయోగశాలలో విద్యార్థులు గణితానికి సంబంధించిన వివిధ రకాల ఎగ్జిబిట్లు, పజిల్స్‌ను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ట్రెజర్ హంట్, గణిత గుర్తులతో రూపొందించిన రంగోలీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే రామానుజన్ ప్రసిద్ధ సంఖ్య 1729 ను విద్యార్థులు వివరంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ, నిత్యజీవితంలో గణిత ప్రాముఖ్యతను వివరించారు. గణితాన్ని భయంగా కాకుండా ఆసక్తిగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఆచరిత,రవీందర్‌రెడ్డి,వెంకట్,ఇతర ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు దుస్తులు పంపిణి



**సికింద్రాబాద్, డిసెంబర్ 22( ప్రజా మంటలు) :** హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు కార్యక్రమము నిర్వహించారు. సామాజిక బాధ్యతతో నిరంతరం విభిన్న సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. దుస్తులు అందుకున్న నిరాశ్రయులు, సంచారజాతులవారు స్కై ఫౌండేషన్ కి కృత్షతలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని. ఓ., సభ్యులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పుల్లూరి శ్రీధర్ రావు ఏకగ్రీవ ఎన్నిక




**ఎల్కతుర్తి డిసెంబర్ 22(ప్రజా మంటలు) :** ఎల్కతుర్తి మండలంలోని నూతన సర్పంచుల ఐక్యతకు ప్రతీకగా సర్పంచ్ ల ఫోరం కమిటీని ఏర్పాటు చేయగా ఆ కమిటీ అధ్యక్షుడిగా వీరనారా యణపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి శ్రీధర్ రావును సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన్ లో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన వహించగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎన్నికైన సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామాల అభివృద్ధి సర్పంచుల మధ్య సమన్వయం ప్రభుత్వ పథకాలను ప్రజలకు సామర్థవంతంగా అందించే అంశాలపై చర్చించారు. అనంతరం సర్పంచ్ ల ఫోరం కమిటీ అధ్యక్షుడి ఎన్నికలకు వెళ్లగా మెజారిటీ సర్పంచుల సమ్మతితో పుల్లూరి శ్రీధర్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను ఈ బాధ్యతకు ఎన్నుకున్న సర్పంచులందరికీ పుల్లూరి శ్రీధర్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. సర్పంచుల ఐక్యతతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రతి గ్రామ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## నా గౌరవ వేతనం గ్రామ అభివృద్ధికే

**ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను**

**సర్పంచ్‌గా మాచర్ల కుమారస్వామి ప్రమాణస్వీకారం**



**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** మండల కేంద్రం గ్రామ సర్పంచ్‌గా మాచర్ల కుమారస్వామి ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణస్వీకార అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ, భీమదేవరపల్లి గ్రామంలో ఇప్పటివరకు ఎప్పుడూ లేనంతగా అత్యధిక మెజారిటీతో తనను గెలిపించిన గ్రామ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. గ్రామస్తులు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని, గ్రామ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా తీసుకొని అందరి ఆశీస్సులతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికలు పూర్తయిన తర్వాత అందరం కలిసి సమైక్యంగా గ్రామ అభివృద్ధి కోసం ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ప్రతినెల సర్పంచ్‌కు వచ్చే గౌరవ వేతనాన్ని పూర్తిగా గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించేందుకు అప్పగిస్తానని ప్రకటించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొని నూతన సర్పంచ్‌కు మద్దతు తెలిపారు. భీమదేవరపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని కుమారస్వామి మరోసారి స్పష్టం చేశారు.

## జిలుగుల గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన గణ బోయిన సృజన





**ఎల్కతుర్తి డిసెంబర్ 22 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలోని జిలుగుల గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం సభ్యులు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు సోమవారం బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ గా గణబోయిన సృజన, ఉప సర్పంచ్ గా పెద్ది శ్రీపాల్ రెడ్డి, అలాగే నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిలుగుల గ్రామ పంచాయితీ కార్యదర్శి రావుల సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామస్తులు ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వార్డు సభ్యులు, పెద్ది శోభారాణి, రావుల రాధిక, తౌటం తిరుపతి, బొమ్మగాని కీర్తన, ఇల సాగరం ప్రశాంత్, కుక్కల సరిత, ఆరెపల్లి రమేష్ , ఆరెపల్లి శ్రీనివాస్, కింసారపు నీతి,ప్రమాణ స్వీకారం అనంతరం, సర్పంచ్ సృజన,ఉప సర్పంచ్ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ,గ్రామ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని ప్రజల సహకారంతో పారదర్శకమైన పాలన అందిస్తామని తెలిపారు. త్రాగునీరు పారిశుద్ధ్యం రహదారులు వీధి దీపాలు పేదల సంక్షేమం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్రామ సమస్యలను ప్రజలతో కలిసి చర్చించి పరిష్కరిస్తామని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా పాలన సమగ్ర గ్రామాభివృద్ధి ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా పాలన సాగిస్తామని నూతన పాలకవర్గం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తౌటం నరేందర్, గూటం జోగి రెడ్డి, రావుల రమేష్, బోల్లెడ్ల సమ్మిరెడ్డి, ముచ్చ బుచ్చిరెడ్డి, కుక్కల ఎర్రయ్య, ఇరిగేసి సంపత్ రావు, రావుల గుండయ్య, గ్రామపంచాయతీ కారోబార్ ఎండి హైమద్ పాషా, గ్రామ పెద్దలు కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన మునిగడప లావణ్య శేషగిరి

**ఎల్కాతుర్తి డిసెంబర్ 22 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి గ్రామ సర్పంచిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా సర్పంచ్ మునిగడప లావణ్య శేషగిరి ఎల్కతుర్తి ఉపసర్పంచిగా గొడిశాల రాజకుమార్ వార్డ్ సభ్యులతో సహా ప్రమాణ స్వీకారం చేయించిన ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి చేతుల మీదుగా జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అధికార పార్టీ పెద్దలు టిఆర్ఎస్ పార్టీ పెద్దలు గ్రామ ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో నూతన సర్పంచులకు జీవన్ రెడ్డి శుభాకాంక్షలు



**జగిత్యాల, డిసెంబర్ 22 :** జగిత్యాల నియోజకవర్గంలోని లక్ష్మీపూర్, నర్సింగపూర్, చల్గల్, దరూర్, సింగారవుపేట్, అల్లిపూర్, ఉప్పమడుగు, అయోధ్య, మహితపూర్ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న జీవన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాలతో తనకు నాలుగు దశాబ్దాలుగా విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో గ్రామపంచాయతీ వ్యవస్థ కీలకమని, కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు బాధ్యత సర్పంచులపై ఉంటుందని పేర్కొన్నారు.గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు వచ్చే విధంగా రాజీవ్ గాంధీ ఆలోచనతో 73వ రాజ్యాంగ సవరణ జరిగిందని, గ్రామాభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకం వరంగా మారిందని అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో రోడ్లు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, మరుగుదొడ్లు వంటి అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.సర్పంచులు గ్రామాన్ని కుటుంబంలా భావించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నూతన సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో టీఎన్జీవో ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్

**సికింద్రాబాద్, డిసెంబర్ 22 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో సోమవారం టీఎన్జీవో గాంధీయూనిట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని మినిస్టిరియల్ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫ్లోరెన్స్ మెర్లిన్ లు కేకు కట్ చేసి, అందరికి ముందస్తు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సిబ్బంది యేసుప్రభువు త్యాగాన్ని, దయాగుణాన్ని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంవో వన్ డా.శేషాద్రి,డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్, ఏవో పద్మిణి ప్రియదర్శిని, ఆఫీస్ సూపరింటెండెంట్ శోభా, సూర్యం, హైదరాబాద్ జిల్లా టీజీవో ప్రెసిడెంట్ కృష్ణయాదవ్, గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ రవీందర్ మంచాల,టీఎన్జీవో ప్రెసిడెంట్ గంట ప్రభాకర్ యాదవ్,సెక్రటరీ ప్రసన్నానంద్,నాయకులు శ్రవణ్ కుమార్, జనార్ధన్, ఖలీమ్, మక్సూద్, సరళ, విజయలక్ష్మీ,అశ్రఫ్

# పల్నాడు జిల్లాలో దారుణం - అన్నదమ్ముల దారుణహత్య

**మృతులిద్దరూ తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు**

**వ్యక్తిగత, కుటుంబపరమైన కారణాలతో హత్యలు జరిగాయని అనుమానం**

**నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం**



పల్నాడు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. దీంతో అంతటా జంట హత్యల కలకలం రేగింది. దుర్గి మండలం అడిగొప్పలలో అన్న కొత్తా శ్రీరాంమూర్తి, తమ్ముడు కొత్తా హనుమంతు అనే ఇద్దరు అన్నదమ్ములను ప్రత్యర్థులు రాత్రి వేటకొడవళ్లతో నరికి అత్యంత కిరాతకంగా చంపారు. యాగంటి నరేష్ అనే వ్యక్తి గ్రామంలో హనుమంతుపై దాడి చేసి హత్య చేసినట్లుగా తెలుస్తుంది. అనంతరం నీలంపాటి అమ్మవారి గుడి దగ్గర వాటర్ ప్లాంట్‌లో ఉన్న శ్రీరామ్మూర్తిపై కూడా కత్తులతో దాడి చేసి హతమార్చినట్టుగా సమాచారం. వ్యక్తిగత, కుటుంబపరమైన కారణాలతోనే ఈ హత్యలు జరిగాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతులిద్దరినీ తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులుగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.ఈ జంట హత్యలపై పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆయన మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని ఆదేశించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఇదిలా ఉండగా మరోవైపు జిల్లాలోని సత్తెనపల్లి మండలం పాకాలపాడులో టీడీపీ కార్యకర్తలపై వైఎస్సార్సీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీడీపీ కార్యకర్తలే ఫ్లెక్సీలు ధ్వంసం చేశారనే అనుమానంతో వైఎస్సార్సీపీ కార్యకర్తలు కర్రలతో దాడికి దిగారు. ఈ క్రమంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు.అసలు ఫ్లెక్సీలు ధ్వంసం చేసింది ఎవరని ఆరా తీయగా ఈ పని వైఎస్సార్సీపీకి చెందిన మరో వర్గం చేసినట్లుగా తేలింది. దీంతో వైఎస్సార్సీపీ శ్రేణులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని టీటీడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడికి దిగడం పట్ల సర్వత్రా విమర్శలకు దారి తీసింది.గతంలోనూ పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బోదలవీడు సమీపంలో గుండ్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా స్కార్పియోతో ఢీ కొట్టి హతమార్చారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీకొన్న స్కార్పియో వాహనం తెలుగుదేశం పార్టీ నేత వెంకట్రామయ్యదిగా గుర్తించారు. తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య కొన్నాళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగిందని, వెంకట్రామయ్య వర్గం వైఎస్సార్సీపీ నుంచి టీడీపీలో చేరి. అనంతరం ఈ ఘటనకు పాల్పడ్డట్టు గతంలోనే పోలీసులు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ జంట హత్యలపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ దుర్ఘటన జరిగినప్పుడే హత్యా రాజకీయాలు ప్రోత్సహించేవారు ఎంతటివారైనా వదలబోమని తెలుగుదేశం పార్టీ నాయకులు స్పష్టం చేసిన విషయం విదితమే.పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులపై 302 సెక్షన్ కింద కేసు నమోదైటంది. ఈ కేసులో ఏ-1గా జవిశెట్టి శ్రీను, ఏ-2గా తోట వెంకట్రావు, ఏ-3గా తోట గురవయ్య, ఏ-4గా నాగరాజు, ఏ-5గా తోట వెంకటేశ్వర్లు, ఏ-6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ-7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

# బెంగళూరు టు విజయవాడ - డ్రగ్స్ తీసుకున్న యువకులు అరెస్ట్

**విజయవాడలో 10 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ముగ్గురు యువకులు అరెస్టు**

**పోలీసుల నిర్లక్ష్యంతో పారిపోయిన నిందితుడు**

**ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు**



విజయవాడలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. బెంగళూరు నుంచి ఎండీఎంఏ తీసుకొచ్చి విజయవాడలోని ఓ హోటల్లో తీసుకుంటుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వీరి నుంచి మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, వారు ఉపయోగించిన కారుతో సహా స్టేషన్ కు తరలించారు. పోలీసులకు మస్కా కొట్టి ఓ నిందితుడు కారులో పరారయ్యాడు. పోలీసులు తేరుకుని పరారైన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.విజయవాడ నగరంలోని మధురానగర్‌కు చెందిన వెంకట జగదీష్ కుమార్, సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన అఖిలేష్ అలియాస్ అఖిల్ ఇంటర్ అయిన తర్వాత చదువు మానేశారు. వీరు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. స్నేహితులు ఇచ్చే పార్టీల్లో ఎండీఎంఏ అలవాటైంది. దీంతో తరచూ బెంగళూరు వెళ్లి అక్కడ కొనుగోలు చేసి విజయవాడ తెచ్చేవారు. ఇక్కడ మత్తుమందును స్నేహితులతో కలిసి తీసుకునేవారు. ఈనెల 19న కారులో వీరిద్దరూ బెంగళూరుకు బయలుదేరారు. 20వ తేదీన అక్కడకు చేరుకున్నారు. మహేష్ వద్దకు వెళ్లి రూ.36 వేలు చెల్లించి 19 గ్రాముల డ్రగ్స్ కొనుగోలు చేశారు. ఇంతలో వీరు బెంగళూరు వెళ్లిన విషయాన్ని జగదీష్ స్నేహితుడు జకీర్ ద్వారా నెల్లూరుకు చెందిన రాజేష్ తెలుసుకున్నాడు.వెంటనే జగదీష్ కుమార్‌కు ఫోన్ చేసి తనకు తెలిసిన తేజ అనే వ్యక్తి నుంచి 2 గ్రాములు ఎండీఎంఏ తీసుకురావాలని కోరాడు. పాత బకాయి కూడా ఇవ్వాల్సి ఉందని చెప్పి ఇందుకు గాను రూ.20 వేలు జగదీష్ కుమార్ యూపీఐ ఖాతాకు బదిలీ చేశాడు. దీనిని జగదీష్ తొలుత తిరస్కరించాడు. పోలీసుల నిఘా ఉందని చెప్పి, ఆ రూ.20 వేలును తిరిగి రాజేష్ ఖాతాకు వెనక్కి పంపించాడు. తర్వాత బతిమలాడి జగదీష్‌ను ఒప్పించి, డబ్బులు పంపించాడు. తర్వాత తేజ వద్ద రెండు గ్రాములు తీసుకుని కారులో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో నెల్లూరులో దిగి రాజేష్‌కు ఎండీఎంఏ ఇచ్చారు. అక్కడ వారు కొంత డ్రగ్స్ తీసుకున్నారు.జగదీష్ కారు మొరాయించడంతో అక్కడే వదిలేసి, రాజేష్ కారులో ముగ్గురూ విజయవాడ చేరుకున్నారు. విజయవాడకు చేరుకున్న తర్వాత మాచవరం స్టేషన్ పరిధిలోని ఓ హోటల్లో దిగారు. అక్కడ ముగ్గురూ డ్రగ్స్ తీసుకుని మత్తులో మునిగి తేలారు. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు హోటల్‌పై దాడి చేసి, నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి 10 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.టాస్క్ ఫోర్స్ పోలీసులు నిందితులను తీసుకుని మాచవరం స్టేషన్లో కారుతో సహా అప్పగించారు. కారును బయట పార్క్ చేసే సమయంలో డోర్ లాక్ పడకపోవడంతో రాజేష్‌కు లాక్ వేయమని పోలీసులు చెప్పడంతో అతను కారు ఎక్కి ఇంజిన్ స్టార్ట్ చేసి రెప్పపాటులో స్టేషన్ నుంచి పరారయ్యాడు. పోలీసుల ఏమరుపాటు కారణంగా స్టేషన్ బయట నుంచే పారిపోయాడు. పోలీసులు తేరుకునే సరికే మాయమయ్యాడు. తర్వాత అప్రమత్తమై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాజేష్ కోసం గాలిస్తున్నారు. మిగిలిన ఇద్దరు జగదీష్ కుమార్, అఖిలేష్‌ను అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరులో వీరికి ఎండీఎంఏ అమ్మిన మహేష్, తేజ కోసం మరో బృందం బెంగళూరు వెళ్లింది.

# బయట తిరగనివ్వవు - ఇంట్లో ప్రశాంతంగా ఉండనివ్వవు


**వానర సమస్య తీర్చండి సారూ!**

**కరీంనగర్ పట్టణంలో తీవ్రమవుతున్న కోతుల బెడద**

**గుంపులుగా ఇళ్లల్లోకి ప్రవేశిస్తూ గందరగోళం**

**అధికారుల చొరవ కరవు**

**పంచాయతీల్లాగే నగరంలోనూ పరిష్కరించాలని ప్రజల ఆవేదన**



ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో సర్పంచిగా పోటీ చేసిన అభ్యర్థులు పలు వాగ్దానాలు చేశారు. కానీ ఒక అభ్యర్థి మాత్రం గ్రామ ప్రజలకు ఒకటే హామీ ఇచ్చాడు. 'నన్ను గెలిపిస్తే ఊర్లో కోతుల బెడద లేకుండా చేస్తా'నని. తీరా ఫలితాల్లో ఆ అభ్యర్థే భారీ మెజార్టీతో గెలుపొందాడు. అక్కడి ప్రజలు వానరాలతో ఎంతగా విసిగిపోయారో ఈ ఘటనతో అర్థమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా వీటి సమస్య అధికంగానే ఉంది. జన సందోహం ఉన్న చోటే హంగామా సృష్టిస్తూ, ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. కోతుల దండు ఒక్కసారిగా ఇళ్లలోకి దూరి, వస్తువులను చిందరవందర చేస్తున్నాయి.గ్రామాల్లో అంటే పంచాయతీ ఎన్నికల ద్వారా కొంత మేర ప్రజలకు కోతుల నుంచి ఉపశమనం కలుగుతోంది. కానీ అంతకంటే ఎక్కువగా పట్టణంలో వానర మూకలు ఉన్నాయి. ప్రధానంగా ముకరంపుర, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, కట్టరాంపూర్, విద్యానగర్, అలకాపురికాలనీ, మంకమ్మ తోట, రాంనగర్, అంబేద్కర్ నగర్, సుభాశ్‌నగర్, హౌసింగ్ బోర్డుతో పాటు విలీన కాలనీల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. పంచాయతీల్లో వాటిని ఎలా తరలిస్తున్నారో, పట్టణంలో కూడా అదే విధంగా కోతుల నుంచి విముక్తి కలిగించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.కరీంనగర్ పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల్లో వాటికి ఆవాసమైన భారీ వృక్షాలను నరికివేశారు. ఆ చెట్లు తప్ప వాటికి మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దీంతో అవి దగ్గర్లోని జనావాసాలకు వచ్చేస్తున్నాయి. కేవలం ఒక్క మర్రి చెట్టు ఉంటే, అక్కడే దాదాపు వెయ్యి కోతులు ఉంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అవి భారీ సంఖ్యలో ఉన్నందున వాటికి ఆహారం దొరకడం చాలా క్లిష్టంగా మారింది. జామ, మామిడి, దానిమ్మ చెట్లు ఉన్న ప్రాంతాలకు అవి ఎక్కువగా వస్తున్నాయి.వానరాలకు ఎక్కడ సులువుగా ఆహారం దొరికితే, అవి మళ్లీ అక్కడికే వస్తాయి. లేదంటే ఏకంగా అక్కడే తిష్ఠ వేస్తాయి. కొంతమంది పండ్లు, ఇతర ఆహార పదార్థాలు ఆరు బయట ఉంచడంతో ఆ ప్రాంతాలకు ఎక్కువగా వస్తున్నాయి. అందుకే వీధుల్లో, ఇళ్లల్లో వాటికి తినడానికి ఏదైనా లభ్యమవుతుందనే నగర ప్రాంతాలను వదిలేయడం లేదు. అపార్టుమెంట్లు, పెద్ద పెద్ద దాబాలపై గంటల తరబడి సంచరిస్తూ, మలమూత్రం విసర్జిస్తూ దుర్గంధంగా మారుస్తున్నాయి.వానరాలు ఇళ్లల్లోకి ప్రవేశించే సందర్భంలో మహిళలు, వృద్ధులు, పిల్లలు వాటికి ఎదురు పడి తరిమేయాలని ప్రయత్నిస్తే దాడులకు దిగుతున్నాయి. కేవలం పట్టణ ప్రాంతంలోనే ఒక నెలకు సగటున 15 మంది వరకు గాయాల పాలవుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో కొందరికి కాళ్లు, చేతులు కూడా విరిగిన సందర్భాలున్నాయి.అధికారులు కోతులను పట్టుకుని, శస్త్ర చికిత్సలు చేయకపోవడంతో వాటి సంతానోత్పత్తి విపరీతంగా పెరిపోయింది. పట్టణంలో దాదాపు వెయ్యి కోతులు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కొండముచ్చులు అంటే కోతులకు భయం. అందుకే కొందరు వాటిని తీసుకొచ్చి వదిలేయడంతో అవి ఆ ప్రాంతాల వరకు రావడం తగ్గించాయి. మరికొందరు కొండెంగల ఫ్లెక్సీలు ముద్రించి, బొమ్మలను ఏర్పాటు చేసి సమస్యాత్మక ప్రదేశాల్లో ప్రదర్శిస్తూ కోతులను పారదోలేందుకు ప్రయత్నిస్తున్నారు.

# నయనానందకరంగా గండికోట



ఎర్రమల కొండలను లోతైన గండిగా పెన్నానది ఏర్పరచుకున్న తీరు, చుట్టూ అందమైన లోయలు నయనానందకరంగా అనిపిస్తుంది. దాదాపు నాలుగు మైళ్ల పొడవు, 300 మీటర్ల ఎత్తైన ఇసుకరాతి కొండల మధ్య పెన్నానది ప్రవహిస్తూ కనువిందు చేస్తుంది. ఇక్కడికి సమీపాన 16, 17 శతాబ్దంలో నిర్మించిన గండికోట చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తుంది. ఈ కోటను వృత్తాకారంలో నిర్మించడం విశేషం.ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట, వైఎస్సార్ కడప జిల్లాలోనే అతిపెద్ద జలాశయం. అంతేకాదు సాగునీటికి పెద్దదిక్కు కూడా. ఈ జలాశయాన్ని 26.85 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా నిర్మించారు. ఈ ప్రాజెక్టులో మూడు నదుల నీరు చేరుతాయి. కాబట్టి ఇది 'త్రివేణి సంగమం'గా మారింది. పెన్నా, చిత్రావతి, కృష్ణా నదీ జలాల కలయికతో గండికోట ప్రసిద్ధి పొందుతోంది. సాగునీటికి గుండెకాయగా మారింది. దానిని నమ్ముకున్న మత్స్యకారులకు కాసులు కురిపిస్తోంది. పర్యాటకంగానూ అనేక ప్రత్యేకతల సమాహారంగా గండికోట ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ప్రభుత్వం స్పందించి పర్యాటకుల కోసం గండికోటలో ఉన్న బ్యాక్ వాటర్‌లో కేరళ తరహా విలాసవంతమైన పడవలు (అల్ట్రా లగ్జరీ బోట్లు) ఏర్పాటు చేయడానికి ఇది అనుకూలమైన ప్రదేశంగా స్థానికులు భావిస్తున్నారు.జిల్లాను టూరిజం హబ్‌గా మార్చడానికి విజన్ 2047లో భాగంగా అధికారులు వివిధ రకాల ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే గండికోట పర్యాటకంగా ప్రసిద్ధి పొందగా అందుకు అనుబంధంగా ఇంకా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దిశగా అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందటంతో పాటు, ఉపాధి అవకాశాలు, ఆదాయ మార్గాలు పెంచడానికి పలు మార్పులకు శ్రీకారం చుట్టింది.గండికోట ప్రాజెక్టు రెండు కొండల మధ్య నిర్మితమై ఉండడంతో ఇక్కడ అందాలు పర్యాటకుల మనసును కట్టి పడేస్తున్నాయి. చూపరులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. గండికోట సొరంగం ద్వారా కృష్ణా జలాలు ప్రాజెక్టు వైపు పరుగులిడే సమయంలో ఎన్నో అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం అక్కడ అద్భుత సుందర దృశ్యాలుగా ఉంటాయి.కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం గ్రామం శివారులో కనుచూపుమేర గండికోట వెనుక జలాలు ఉంటాయి. ఈ మార్గంలో రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా ప్రయాణం చేసే వారికి ఆ నీటి సవ్వడుల్లో ఎన్నెన్నో అందాలు కనువిందు చేస్తుంటాయి. అలాగే గండికోట ప్రాజెక్టు నుంచి పెన్నాలోయ మీదుగా మైలవరం జలాశయం వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే ఈ ప్రాంతంలో బోటు షికారు ఏర్పాటు చేస్తే ప్రకృతి సౌందర్యాన్ని, ప్రశాంతమైన వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. అంతేకాకుండా గండికోట వెనుక జలాల్లో సాయంత్రం వేళ భానుడి లేలేత కిరణాలు మధురానుభూతిని అందిస్తాయి.ప్రాజెక్టు వద్ద పర్యాటకులు సేద తీరడానికి ఉద్యానవనం (పార్కు), రిసార్టులు తదితర వాటిని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. చిత్రావతి, పెన్నా, కృష్ణా జలాలు కలుస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక ఘాట్లు నిర్మిస్తే పుణ్య స్నానాలకు వచ్చే వారికి అనుకూలంగా ఉంటుంది. గండికోట, మైలవరం జలాశయాల్లో కేరళ తరహా లగ్జరీ బోట్లలో విడిది ఏర్పాటు చేస్తే నీటి మధ్యనే రోజంతా ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు ఇక్కడ లభించే అరుదైన జలచరాలతో పర్యాటకులు మరింత సంతృప్తి పొందుతారు. అయితే ఇక్కడికి చేరుకోవాలంటే అనంతపురం నుంచి తాడిపత్రికి వచ్చి ఇక్కడ నుంచి జమ్మలమడుగుకు వెళ్లాలి. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో గండికోట చేరుకోవచ్చు.

## గాంధీ ఆసుపత్రిలో టీఎన్జీవో ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్




**సికింద్రాబాద్, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో సోమవారం టీఎన్జీవో గాంధీయూనిట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని మినిస్టిరియల్ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫ్లోరెన్స్ మెర్లిన్ లు కేకు కట్ చేసి, అందరికి ముందస్తు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సిబ్బంది యేసుప్రభువు త్యాగాన్ని, దయాగుణాన్ని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంవో వన్ డా.శేషాద్రి,డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్, ఏవో పద్మిణి ప్రియదర్శిని, ఆఫీస్ సూపరింటెండెంట్ శోభా, సూర్యం, హైదరాబాద్ జిల్లా టీజీవో ప్రెసిడెంట్ కృష్ణయాదవ్, గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ రవీందర్ మంచాల,టీఎన్జీవో ప్రెసిడెంట్ గంట ప్రభాకర్ యాదవ్,సెక్రటరీ ప్రసన్నానంద్,నాయకులు శ్రవణ్ కుమార్, జనార్ధన్, ఖలీమ్, మక్సూద్, సరళ, విజయలక్ష్మీ,అశ్రఫ్ నజీరా, డి.సత్యనారాయణ, పి.శ్రీనివాస్,బ్రహ్మం,గోపాల్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**



**జగిత్యాల డిసెంబర్ 22 (ప్రజా మంటలు) :** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## కోర్టు పేషీకి హాజరైన జెఎస్ఆర్

**రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం**



**హుస్నాబాద్ డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నా సందర్భంగా అప్పటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అక్రమంగా నమోదు చేసిన కేసుల నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి గురువారం గౌరవ కోర్టు పేషీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి సహా పలువురు పార్టీ నాయకులు కోర్టులో హాజరై న్యాయ ప్రక్రియను ఎదుర్కొన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన శాంతియుత నిరసనలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని నేతలు వ్యాఖ్యానించారు. రైతుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కేసులో బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సెన్సార్ బోర్డు సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తోట స్వరూప, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, మండల అధ్యక్షుడు సంపత్ నాయక్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోల్లపెల్లి వీరాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్, మాజీ మండల అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొనగిరి రవి, బొల్లి శ్రీనివాస్, బొమ్మగాని రవీందర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారి, కార్యదర్శి ఆకోజు అరుణ్ కుమార్, బీజేవైయం మండల అధ్యక్షుడు ఇటుక్యాల కుమారస్వామి, బీజేవైయం మాజీ అధ్యక్షుడు జాప శ్రావణ్ రెడ్డి తదితరులు కోర్టుకు హాజరయ్యారు.

## వర్షకొండ లోని అక్షర భారతి కాన్వెంట్ స్కూల్లో మ్యాథ్స్ డే వేడుకలు



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 22 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలోని అక్షర భారతి కాన్వెంట్ స్కూల్లో గణిత శాస్త్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన గణిత నమూనాలు కొన్ని చిత్రాలు సందర్శించి అందరి ప్రశంసలు పొందారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి చొరవ చూపాలి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**జగిత్యాల డిసెంబర్ 22 (ప్రజా మంటలు) :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లు, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 34 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి.ఎస్ లత,బి.రాజగౌడ్, కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు, వార్డు సభ్యులను సన్మానించిన జెఎస్ఆర్



**భీమదేవరపల్లి, డిసెంబర్ 22 (ప్రజామంటలు) :** మండలంలోని కొత్తకొండ, ధర్మారం గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కొత్తకొండ గ్రామంలో బీజేపీ సర్పంచ్ సిద్దమల్ల రమ రమేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులను జెఎస్ఆర్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందడుగు వేయాలని, సమిష్టి కృషితో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అలాగే ధర్మారం గ్రామంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి హాజరైన జెఎస్ఆర్, అక్కడ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గొపగాని తిరుపతి, పాలకవర్గ సభ్యులు గుర్రం వెంకన్న, ఎలబాక సురేష్, గాడిపల్లి హరీష్, రుద్రరపు జీవన్, మెట్టు సుగేందర్, గుర్రం రాజేష్, సన్నీ, బన్నీ తదితరులను సన్మానించారు. ఈ రెండు కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com